# నంగులమ్మ దున్నపోతు

ఏటవుతలి ఊళ్ళల్లో యెవురో దాన్ని సిన్నప్పుడు నంగులమ్మకని[1] యిడ్సినారంట. ఇంగ అప్పుట్నించీ అది అడ్డం ల్యాకుండా యే సేలల్లో పడ్తే ఆ సేలల్లో పడి మేసి యిరగబల్చి ఏనిగాలయి, మకురెక్కిపోయింది. ఏనిగ కన్నా ఎప్పుడో ఒకసారి మదమెక్కుతాదంటగానీ, యీ నంగులమ్మ దున్నపోతుకు యెక్కిన మదం యెప్పుడూ దిగిందే లేదు. అదో .... ఆ జెనుసుగడ్డ[2] లాయన అట్ట దాని మదం దించినాడు గానీ, దానికై అద్దిగ లేదు. ఆ దున్నపోతెట్టుండె, ఆ జెనుసుగడ్డలాయప్ప యెట్టుండె ? అజ్జెప్తేగినా ....... అచ్చెర్యమయిపోతాది మల్ల.

నంగులమ్మ దున్నపోతు అంత దూరాన్నుంచీ బుసపెడ్తా వస్తాంటే, నల్లని మోడం గదా వురుముతా పెరుగుతా వస్తాన్నెట్టుంటాది. అయితే మోడెం వచ్చేది జూస్తే సంబరమైతే, యిదొచ్చేది కనపడ్తే బెదురుపుట్టేది. ఏట్లో ఆవల్ల అది దిగిందంటే యీ వల్ల నీళ్ళు తెచ్చుకొనే ఆడోళ్ళూ మొగోళ్ళూ ఆదలా బాదలా పరిగెత్తా యిండ్లల్లో పడేవాళ్ళు. అది ఏటి మీద వచ్చేతప్పుడు అంత దూరాన మనిసి కనపన్నా, గొడ్డు కనపన్నా ఇసికలో మోకాల్లోతున గుంత పడేట్టుగా కాల్దువ్వుతాది. ఆకాసెంలో బోయే పచ్చి గూడా ఆ దున్నపోతు మీనబోయేప్పుడు అర్సకుండా బోతాది ! సుట్టుపట్ల పదూళ్ళలో పిల్లోళ్లుగినా యేడ్సుతే, వాళ్ళమ్మగార్లు 'నంగులమ్మ దున్నపోతొస్తాందాది' అని బెదిరిచ్చి ఏడుపు మానిపిచ్చేవాళ్ళు.

ఏట్లో అయ్యాలప్పుడూ యియ్యాలప్పుడూ బండి పోవాల్నంటే యెక్కన్నుంచీ అదొస్తాదో అని గుండెలు లొటలొటలాడేటియి. శానామాట్లు అది ఎద్దల మీద బడి, సెలిగిపారేసింది. ఏట్లో పగులు ఎనుములు మేసేతప్పుడు అల్లాటప్పా ఎనుమయితే నడుములిరిగి అన్నే పడిపోవాల్చిందే. ఎనమల్తో పాటు యాన్నన్నా దున్నపోతుగానీ దాని కంటిక్కనిపడిందంటే, యింగ దానికి తీర్నెట్టే ! ఎద్దుల మీంద కంటే దానికి దాన్జాతయిన దున్నపోతు మీంద యింగామాంతమైన[3] కోపం. ఏట్లో గడ్డి పరకలు మేసేదానికీ, యాసేలోనైనా పడి మెత్తని పైరు మేసే తనకూ యాసమందం లేదని సెప్పదానికదట్ట జేసేదేమో.... తెల్దు. దున్నపోతు దాని కంటబడ్తే మల్ల బతకనీదని మాత్రం అందరికీ తెల్చిందే.

'నంగులమ్మ దున్నపోతు' అని అంటా వుండడమేగానీ దానికీ, ఏట్లో గడ్డిమేస్తా వుండే బక్క దున్నపోతుకూ సమందమున్నెట్టు యెవురికీ గ్యాపకమొచ్చేదీ గాదులే. దాన్జూస్తానే బెదిరిపోతా, "దీనికి సరకతగలా[4], దీన్ని నంగులమ్మకాడ యెప్పుడు నరుకుతారో" అని తిట్టుకుంటానే, మల్లా తిట్నిందుకు సెంపలేసుకునేవాళ్ళు. "దేవత కిడ్సిన దున్నపోతును తిడ్తే పాపం" అనుకునేవాళ్ళు. దేవతా దున్నపోతు సేలల్లో పడి తింటే తిన్నీలే ... అద్దింటే మనకెంత నట్టమయితాది అనుకునేవాళ్ళు. అదేమన్నా పొద్దాకులూ ఒక్కని సేలోనే పడి తింటా వుందా, అందరి సేలల్లోనూ పడి తింటా వుంది గదా, అనుకునేవాళ్ళు.

అది కడుపు నిండా మేసొచ్చి, ఏ ఊరి ముందరన్నా పండుకోని నెమరేస్తాంటే, దూరాన్నుంచీ సిత్రంగా సూసేవాళ్ళు జనం. అది పండుకోనుంటే యెంత దర్జాగా వుండాదో, దాని యీపు యెంత

1) నంగులమ్మ అనే గ్రామదేవత 2) గెనుసుగడ్డలు లేక చిలకడదుంపలు

3) తీవ్రమైన 4) దూము, కలరా

ఎడల్పుగా వుందో, పెయి యెంత నున్నంగా యీగవాల్తే జారిపోయేట్టుండాదో, మెడ యెంత లావుగా రొండు సేతుల్తో కర్సుకొన్నా అందకుండా వుండాదో .... మాట్టాడుకుంటారు. ఫలానా ఊళ్ళో యెవురో తన సేలో మేసిందని, ములుగట్టెతో నంగులమ్మ దున్నపోతు యీపున యెప్పుడో కొట్నాడంట. ఆ రాత్రికే ఆయప్ప యీపున మంటలు పుట్టి అల్లాడిపోయినాడు ! యింగెవురో దాన్ని 'సరకతగలా' అని తిట్నారంట. మర్సటిరోజు పాలిచ్చే ఎనుము గాటికాన్నే పడి సచ్చిపోయిందంట ! యిట్ట మాట్టాడుకుంటారు. దేవతా దున్నపోతును కొట్నా, తిట్నా యేమయిందో సెప్పుకుంటా వుండేటియి యెక్కడ జరిగినాయో యెవురికీ తెల్దు. ఆ దేవతా దున్నపోతు సేలను పాడు జేసేదీ, అందర్నీ బయపడిస్తా వుండేదీ కండ్లకు కనపడ్తానే వుండాది. అయినా కనపడ్తా వుండేవాటికన్నా, కనపడకుండా వుండేటియే వాళ్ళ మీంద బలంగా పన్జేస్తాండాయి !

యిట్టాటప్పుడు అజ్జరిగింది. ఆ రోజు తెల్లవార్నాల నుంచీ ఊళ్ళో అందరూ జెనుసుగడ్డలు కొనుక్కపోతా వుండారు శాట్లల్లో[5] పోసుకోని. గడ్డలు బలే తియ్యంగా వుండాయని అనుకుంటా వుండారు. ఒకర్ని జూసి ఒకరు శాట్లల్లో గింజలు పోసుకోని పోయి ఆ గడ్డలు తెచ్చుకున్రి. దాంతో ఏ పయిటాలకో[6] గానీ గడ్డలు అయిపోవనుకున్న జెనుసుగడ్డలాయప్పకు సినంబళ్ళ పొద్దుకే పనయిపాయె. ఎండబడకుండా మల్లా ఊరు జేరుకొందామని, ఆ జెనుసుగడ్డ లాయప్పా, ఆయప్ప కొడుకు గింజల మూటెను బండ్లో యేసుకోని దున్నపోతుల్ను బండికి గట్టి, ఏట్లో దిగిరి. తెచ్చుకున్న సద్దికూడు తీసకపోకుండా తినిపోతే బాగుంటాది గదాని, ఏట్లో సెలిమకాడ కూచ్చోని సద్దిమూట యిప్పినారు. పక్కన్నే బండిక్కట్ను దున్నపోతులు నెమరేస్తా నిలబడుకోనుండాయి. యాన్నుంచీ వొచ్చిందో నంగులమ్మ దున్నపోతు వొచ్చీ రావడంతోటే యీ దున్నపోతుల మీంద పడింది. సద్ది దినేవాళ్ళొచ్చి సిన్నసిన్న రాళ్ళేస్తా అదిలిస్తే అది లెక్కే జేయలా. కాళ్ళూ సేతులూ ఆడక వాళ్ళు సూస్తా వుండగానే ఒక దున్నపోతును నిలువునా సంపేసింది ! యింగోటి పట్టెడ తెంపుకోని తప్పిచ్చుకోని పారిపోయింది. నడేట్లో తనకైన గతి జూసేసరికి యేమనిపిచ్చిందో... జెనుసుగడ్డలాయప్ప బండెక్కి జొల్లకాపుగా కట్న మాంచి శావ నాటు[7] సేతికి తీసుకొన్నాడు. నంగులమ్మ దున్నపోతు రెండు కొమ్ముల సందున తలకాయలోంచీ మెదుడు బయటపడేతట్టు... ఒక్కేటు యేసినాడు ! ఎట్టేసినాడో తెల్దు. నంగులమ్మ దున్నపోతు బయం మాత్రం మల్ల ల్యాకుండా పోయింది.

దేవతా దున్నపోతును సంపినందుకు ఆయప్పకేదో అయితాదని అందరూ అనుకొన్నారు. ఏం గాలేదు. ఆయప్ప ఎన్నో మాట్లు జెనుసుగడ్డలు అమ్ముకోను వస్తానే వుండె. "అంత పెద్ద దున్నపోతును యింత సిన్న మనిసివి యెట్ట సంపితివి ?" అనడిగితే, "ఎట్ట సంపినానో నాకే తెల్దు" అని నగేవాడు.

5) చేటల్లో 6) ఏ అపరాహ్ణానికో 7) చేవగలిగిన నాటు (కర్ర)